APTEL/26/A4269

అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ సోమవారం 19 అక్టోబర్ 2026 సంపుటి: 01 సంచిక :143 పేజీలు : 04 వెల: 2-00/-

మా తీర్పు కాగితాలకే పరిమితం కావాలా?'- రుతుక్రమ ఆరోగ్యంపై రాష్ట్రాల నిర్లక్ష్యం




- రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద రుతుక్రమ ఆరోగ్యాన్ని ప్రాథమిక హక్కుగా గుర్తించిన చారిత్రాత్మక తీర్పు అమలుపై రాష్ట్రాలు
- , కేంద్ర పాలిత ప్రాంతాల నిర్లక్ష్యంపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఢిల్లి : రుతుక్రమ ఆరోగ్యాన్ని (బహిష్ఠ పరిశుభ్రత) ప్రాథమిక హక్కులో భాగంగా గుర్తిస్తూ ఇచ్చిన తీర్పు అమలుపై

ఇరాన్ నూతన రక్షణ మంత్రిగా మెహ్రాదాద్ అఖ్లాఘీ..

పార్లమెంట్ ఆమోదం

- ఇరాన్ నూతన రక్షణ మంత్రిగా మెహ్రాదాద్ అఖ్లాఘీ ఎంపికయ్యారు.
- పార్లమెంట్‌లో జరిగిన విశ్వాస పరీక్షలో ఆయనకు అనుకూలంగా 237 ఓట్లు వచ్చాయి.
- గతంలో ఇరాన్ రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో అఖ్లాఘీ కీలక బాధ్యతలు నిర్వహించారు.



ఢిల్లి : ఇరాన్ మాజీ రక్షణ మంత్రి అజీజ్ నసీర్‌జాదే అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన దాదాపు 8 నెలల తర్వాత, ఆ దేశ పార్లమెంట్ (ఇస్లామిక్ కన్సల్టేటివ్ అసెంబ్లీ) నూతన రక్షణ మంత్రిగా మెహ్రాదాద్ అఖ్లాఘీ అభ్యర్థిత్వానికి అధికారికంగా ఆమోదం తెలిపింది. ఇవాళ (ఆదివారం) జరిగిన పార్లమెంట్ సమావేశంలో రక్షణ, సాయుధ దళాల లాజిస్టిక్స్ మంత్రిగా ఆయనకు ఎంపీలు విశ్వాస ఓటు ప్రకటించారు.

మిగతా..2లో

మనమూ అక్కడకు పోదాం.. ఫ్రాన్స్‌లో నిరసనలపై ట్రంప్ ఎద్దేవా

- హింసాత్మక నిరసనలతో ఫ్రాన్స్ అట్టుడుకుతున్న నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సెటైర్లు పేల్చారు.
- ఫ్రాన్స్ సుందరమైన దేశమని, ఎలాంటి తిరుగుబాట్లు, లూటీలు ఉండవని ఎద్దేవా చేశారు.



ఢిల్లి : హింసాత్మక నిరసనలతో ఫ్రాన్స్ అట్టుడుకుతున్న నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సెటైర్లు పేల్చారు. ఫ్రాన్స్ సుందరమైన దేశమని, ఎలాంటి తిరుగుబాట్లు, లూటీలు ఉండవని ఎద్దేవా చేశారు. యూఎస్ మిడ్‌టర్మ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇటీవల కెంటకీ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రంప్ ఈ కామెంట్స్ చేశారు. మిగతా..2లో

ఒక్క ఉద్యోగం లేదు, కోట్లాది రూపాయలు వసూలు

టోమ్‌కామ్‌పై హరీశ్ రావు ఫైర్



- జర్మనీ ఉద్యోగాల పేరిట టోమ్‌కామ్ భారీ మోసానికి పాల్పడిందన్న హరీశ్ రావు
- 70 మంది యువకుల నుంచి ఒక్కొక్కరి దగ్గర రూ.4.5 లక్షల వరకు వసూలు
- రెండేళ్లు గడిచినా ఒక్కరికీ ఉద్యోగం రాలేదని, ఇంటర్వ్యూ కూడా జరగలేదని ఆరోపణ
- బాధితులకు నష్టపరిహారం ఇచ్చి, సీఐడీ విచారణ జరపాలని బీఆర్ఎస్ డిమాండ్
- టోమ్‌కామ్ ఫీజులు, ఇచ్చిన ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని విజ్ఞప్తి

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ప్రభుత్వ ఆధ్వర్యంలోని టోమ్‌కామ్ (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ) నిరుద్యోగ యువతను దోచుకునే

హైదరాబాద్‌లో బతుకమ్మ వేడుకలు.. పాల్గొన్న సీతక్క

- హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం సమీపంలో అమరజ్యోతి ప్రాంగణం వద్ద బతుకమ్మ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి.
- ఈ వేడుకల్లో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పాల్గొన్నారు.



హైదరాబాద్, అక్టోబర్ 18: నగరంలోని రాష్ట్ర సచివాలయం సమీపంలో అమరజ్యోతి ప్రాంగణం వద్ద బతుకమ్మ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఆమె అధ్వర్యంలో ఇతర మహిళలతో కలిసి బతుకమ్మ పాటలు పాడారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క పూలను అందంగా పేర్చి.. బతుకమ్మను సిద్ధం చేశారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో మమేకమైన జీవనశైలికి ప్రతీకగా నిలిచే ఈ బతుకమ్మ పండుగను వారంతా సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. దీంతో అమరజ్యోతి ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ సంస్కృతి, మహిళల ఐక్యతను చాటిచెప్పే బతుకమ్మ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సంగతి తెలిసిందే.

వివరాలు 2లో..

ఎన్హెచ్ఎం ఉద్యోగుల జీతాల్లో కోత..

ప్రభుత్వంపై కవిత ఫైర్



2లో..

- జీతాలు తగ్గిస్తూ ఇచ్చిన జీవో 1195ను రద్దు చేయాలని కవిత డిమాండ్
- కొందరి ఉద్యోగులకు రూ.4,000 నుంచి రూ.5,000 వరకు జీతాలు తగ్గాయని ఆరోపణ
- సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక

హైదరాబాద్: నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల జీతాలను తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 1195పై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది అత్యంత అన్యాయమైన చర్య అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకుని ఈ నిర్ణయాన్ని సమీక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. బంజారా హిల్స్‌లోని పార్టీ కార్యాల -యంలో ఎన్హెచ్ఎం ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు.

స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులనే గెలిపించండి



- వైసీపీ హయాంలో తిరోగమనం చెందిన రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు మోదీ సహకారంతో మళ్లీ పురోగమనంలోకి తెచ్చారని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.
- ఈ మేరకు స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థి అజేష్ యాదవ్‌ను గెలిపించాలని మంత్రి ప్రజలను కోరారు.

అమరావతి, అక్టోబర్ 18: స్థానిక ఎన్నికల నామినేషన్ నేపథ్యంలో వైసీపీ అల్లర్లు సృష్టించడంపై మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పందించారు. జగన్ హయాంలో రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని.. అందుకే ప్రజల ముందుకొచ్చి ఓట్లు అడిగే ధైర్యం లేక దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మిగతా..2లో

పండగ పూట ఛార్జీల బాదుడు.. ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్



పండగ స్పెషల్ బస్సుల ఛార్జీల పెంపుపై హరీశ్ రావు విమర్శలు

సాధారణ బస్సులనే స్పెషల్స్‌గా నడుపుతూ అధిక ఛార్జీలు వసూలు

స్పెషల్ బస్సులపై 50 శాతం సర్‌ఛార్జి మాత్రమేనంటున్న టీజీఎస్ఆర్టీసీ

హైదరాబాద్ :బతుకమ్మ, దసరా పండగల వేళ తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ ఛార్జీలు పెంచి ప్రజలపై తీవ్ర భారం మోపుతోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. పండగకు సొంతూళ్లకు వెళ్లేవారి ఉత్సాహాన్ని ఈ ఛార్జీల పెంపు దెబ్బతీసిందని ఆయన ఆరోపించారు. ఛార్జీల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సాధారణ సర్వీసులను తగ్గించి, వాటినే పండగ స్పెషల్ బస్సులుగా చూపిస్తూ అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు సాధారణ టికెట్ ధర రూ. 230 ఉండగా, ఇప్పుడు రూ. 400 వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే మహబూబ్‌నగర్ నుంచి ఎంజీబీఎస్‌కు రూ. 220 ఉన్న టికెట్‌ను రూ. 290కి పైగా పెంచారని తెలిపారు. మిగతా..2లో


జగన్‌కు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత ఉందా..?



- వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.
- నేడు ప్రజాస్వామ్యం గురించి ప్రశ్నిస్తున్న జగన్..
- 2020 స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్షాలపై జరిగిన దాడులకు ఏమని సమాధానం చెబుతారని నిలదీశారు.

ఏపీలో మున్సిపల్ ఎన్నికలు.. ముగిసిన నామినేషన్ల గడువు

- చివరి రోజు భారీగా తరలివచ్చిన అభ్యర్థులు
- దర్శిలో సమయానికి చేరుకోలేక 25 మంది వైసీపీ అభ్యర్థుల వెనుదిరిగిన వైనం
- అక్టోబర్ 19న నామినేషన్ల పరిశీలన, 28న పోలింగ్
- అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి



అమరావతి :ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ ముగిసింది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు నామినేషన్లు దాఖలు చేసేందుకు విధించిన గడువు ఆదివారం (అక్టోబర్ 18) మధ్యాహ్నం 3 గంటలతో ముగిసింది. చివరి రోజు కావడంతో రాష్ట్రవ్యాప్తంగా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు అభ్యర్థులు, వారి మద్దతుదారులతో కిటకిటలాడాయి. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయానికి కార్యాలయ ప్రాంగణాల్లో ఉన్న వారందరికీ అధికారులు టోకెన్లు జారీ చేసి, వారి నుంచి మిగతా..2లో

ఏపీలో రాష్ట్రపతి పాలన పెట్టండి



- స్థానిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికారం యంత్రాంగం విఫలమైందన్న జగన్
- ఈసీ ప్రేక్షక పాత్ర వహిస్తోందని విమర్శ
- చంద్రబాబు కనుసన్నల్లో ఈసీ పనిచేస్తోందని ఆరోపణ

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని వైసీపీ అధినేత జగన్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో రాజ్యాంగ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని, ప్రజాస్వామ్యాన్ని అధికార పార్టీ ఖూనీ చేస్తోందని ఆదివారం ఆయన తీవ్రంగా ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కరవయ్యాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు కనుస న్నల్లోనే రాష్ట్ర ఎన్నికల సంఘం పని చేస్తోందని జగన్ విమర్శించారు. నామినేషన్ కేంద్రాల వద్ద టీడీపీ వర్గాలు మాటువేసి, మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

ఏపీలో మున్సిపల్ ఎన్నికలు..

ముగిసిన నామినేషన్ల గడువు

నామినేషన్ పత్రాలను స్వీకరించారు. ప్రధాన రాజకీయ పార్టీలైన టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీతో పాటు స్వతంత్ర అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో పురపోరు రసవత్తరంగా మారనుంది.

దర్శిలో వైసీపీకి ఎదురుదెబ్బ

ప్రకాశం జిల్లా దర్శిలో వైసీపీకి ఊహించని పరిణామం ఎదురైంది. గడువు ముగియడంతో దాదాపు 25 మంది వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయలేకపోయారు. నమయానికి కార్యాలయానికి చేరుకోలేకపోవడంతో వారు నిరాశగా వెనుదిరగాల్సి వచ్చింది. ఈ పరిణామం స్థానికంగా చర్చనీయాంశమైంది.

తదుపరి షెడ్యూల్ ఇదే

నామినేషన్ల పర్వం ముగియడంతో ఎన్నికల సంఘం తదుపరి ప్రక్రియపై దృష్టి సారించింది. షెడ్యూల్ ప్రకారం, రేపు (అక్టోబర్ 19) నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. అక్టోబర్ 21 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. ఉపసంహరణల గడువు ముగిసిన తర్వాత బరిలో నిలిచే తుది అభ్యర్థులపై స్పష్టత రానుంది. అక్టోబర్ 28న పోలింగ్ జరగనుండగా, అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తారు.

ఏపీలో రాష్ట్రపతి పాలన పెట్టండి

వైసీపీ అభ్యర్థులను దౌర్జన్యంగా అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు. కేవలం రెండు రోజుల ముందు రిజర్వేషన్లు ప్రకటించి, 24 గంటల్లో నామినేషన్లు వేయమనడం ప్రతిపక్షానికి సమయం ఇవ్వకూడదనే కుట్రలో భాగమేనని ఆరోపించారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో ఎస్ఈసీగా నిమ్మగడ్డ రమేశ్ కుమార్ ఉన్నప్పుడు కలెక్టర్లు, ఎస్పీలను బదిలీ చేసినా తాము ధైర్యంగా ఎన్నికలకు వెళ్లి విజయం సాధించామని జగన్ గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి ఆ ధైర్యం లేదని విమర్శించారు. అన్నమయ్య జిల్లా పుంగనూరులో జరిగిన ఘర్షణల నేపథ్యంలో ఈ వివాదం మరింత ముదిరింది. వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి తన పార్టీ అభ్యర్థులతో నామినేషన్ వేయడానికి వెళ్లినప్పుడు టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య తీవ్ర ఘర్షణలు చెలరేగాయి. ఈ హింసకు వైసీపీనే కారణమని టీడీపీ ఆరోపిస్తుండగా, తమ ఎంపీపైనే దాడి జరిగిందని వైసీపీ ప్రత్యారోపణలు చేస్తోంది. అయితే, నిబంధనలకు విరుద్ధంగా ఎంపీ మిథున్ రెడ్డి వందలాది మంది అనుచరులతో రావడం వల్లే ఉద్రిక్తత తలెత్తిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలపై ఇరు పార్టీల నేతలు రాష్ట్ర ఎన్నికల సంఘానికి పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నాయి. ఈ ఆరోపణలపై ఈసీ నివేదికలు కోరినట్లు సమాచారం.

స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులనే గెలిపించండి

నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్న వైసీపీ.. నీతి మాటలు చెప్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని మంత్రి ఎద్దేవా చేశారు. 'కూటమి హయాంలోనే రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో పట్టణాభివృద్ధికి భారీగా నిధులు తీసుకొచ్చింది. 16వ ఆర్థిక సంఘం నాలుగున్నర లక్షల కోట్ల నిధులను ఏపీకి కేటాయించింది. కేంద్రం, రాష్ట్రం, స్థానికంగా ఒకే ప్రభుత్వం ఉంటేనే నిధులు బాగా వస్తాయి. అదే వేరే వారు ఇక్కడ గెలిస్తే.. నిధులు వచ్చే అవకాశం ఉండదు. ఈ అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే.. స్థానిక సంస్థల ఎన్నికల్లో మళ్లీ కూటమి అభ్యర్థులనే గెలిపించండి. గ్లాస్, సైకిల్, కమలం.. ఇలా గుర్తులు వేరైనా ఎన్నికల్లో మూడు పార్టీలు కలిసే పనిచేస్తాయి. రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ముఖ్య లక్ష్యం' అని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.

మనమూ అక్కడకు పోదాం..

ఫ్రాన్స్‌లో నిరసనలపై ట్రంప్ ఎద్దేవా

తమ ప్రభుత్వం ప్రజలకు ఇవ్వబోయే 5 వేల డాలర్ల గురించి మాట్లాడుతూ ఫ్రాన్స్ ప్రస్తావన కూడా తెచ్చారు. 'నేనిచ్చే 5 వేల డాలర్లతో ఫ్రాన్స్‌కు వెళ్లవచ్చు. అది చాలా సుందరమైన ప్రాంతం. విప్లవాలు, తిరుగుబాట్లు ఏవీ ఉండవు' అంటూ ఫ్రాన్స్‌లో తాజా పరిస్థితుల గురించి ట్రంప్ ఎద్దేవా చేశారు. 'పదండి ఫ్రాన్స్‌కు వెళదాము. విప్లవకారులతో చేతులు కలుపుదాము. విప్లవాలకు ఫ్రాన్స్ సహజసిద్ధమైన స్థానం. అక్కడి పరిస్థితులు నమ్మలేనట్టుగా ఉన్నాయి' అని మరో సెటైర్ పేల్చారు. మూడో ప్రపంచ దేశాల నుంచి వలసలను పాశ్చాత్య ఉదారవాదులు ప్రోత్సహించడమే ప్రస్తుత పరిస్థితులకు కారణమని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వ్యాఖ్యానించారు. కారుణ్యం, మానవత్వం పేరిట వలసలను ప్రోత్సహించారని అన్నారు. పాశ్చాత్య సమాజంలో వారు ఇమడగలరా? ఇక్కడి సంస్కృతికి వారు తగిన వారేనా? అన్న విషయాన్ని పట్టించుకోలేదని విమర్శించారు.

హైదరాబాద్‌లో బతుకమ్మ వేడుకలు.. పాల్గొన్న సీతక్క

ఈ బతుకమ్మ వేడుకలకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళలు భారీ ఎత్తున తరలి వచ్చారు. తెలంగాణలో బతుకమ్మ పండుగకు ప్రత్యేకమైన సాంస్కృతిక ప్రాధాన్యం ఉన్న సంగతి తెలిసిందే. ప్రకృతిని ఆరాధిస్తూ, వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి, మహిళలు సమూహాలుగా ఏర్పడి పాటలు పాడుతూ ఈ పండుగను జరుపుకుంటారు. ఈ బతుకమ్మ పండుగ తెలంగాణ జీవన విధానాన్ని ప్రతిబింబిస్తుంది. మహిళల మధ్య ఐక్యత, ఆత్మీయతను పెంపొందించడంలోనూ ఈ పండుగ కీలక పాత్ర పోషిస్తుంది.

ఎన్హెచ్ఎం ఉద్యోగుల జీతాల్లో కోత.. ప్రభుత్వంపై కవిత ఫైర్

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17,000 మంది ఎన్హెచ్ఎం ఉద్యోగులు పనిచేస్తుండగా, తాజా జీవో కారణంగా కొందరి జీతాల్లో రూ.4,000 నుంచి రూ.5,000 వరకు కోత పడిందని కవిత ఆరోపించారు. ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుతున్న ఈ క్లిష్ట సమయంలో జీతాలు తగ్గించడం ఎంతవరకు సమంజసమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కొందరికి జీతాలు పెంచి, మరికొందరికి తగ్గించడంలో వివక్ష కనిపిస్తోందని ఆమె విమర్శించారు. కేంద్రం ఎన్హెచ్ఎం జీతాల కోసం నిధులు ఇస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం వాటిని సకాలంలో విడుదల చేయడం లేదని ఆరోపించారు. ఎన్నికల ముందు ఎన్హెచ్ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు వారికి న్యాయం చేయడం లేదని కవిత విమర్శించారు. కాంగ్రెస్ పాలిత హిమాచల్ ప్రదేశ్‌తో సహా ఏడు రాష్ట్రాలు ఇప్పటికే ఎన్హెచ్ఎం సిబ్బందిని పర్మినెంట్ చేశాయని గుర్తుచేశారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా 30 శాతం జీతాలు పెంచి, వారిని క్రమబద్ధీకరించాలని అసెంబ్లీలో తీర్మానం చేసిందన్నారు. గ్రామీణ ఆరోగ్య వ్యవస్థ, వ్యాక్సినేషన్ కార్యక్రమాల్లో ఎన్హెచ్ఎం ఉద్యోగుల పాత్ర కీలకమని కవిత నొక్కి చెప్పారు. ఉద్యోగులు నిరసన తెలిపేందుకు అనుమతి నిరాకరించడం, ఆరోగ్య మంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలు పెంచడంతో పాటు, ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, ఉద్యోగులకు మద్దతుగా తమ సంస్థ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని ఆమె హెచ్చరించారు.

పండగ పూట ఛార్జీల బాదుడు..

ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్

ఇదేనా మీ ప్రజా పాలన అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అయితే, ఈ ఛార్జీల పెంపు కేవలం పండగ రద్దీ కోసం నడుపుతున్న 7,000 ప్రత్యేక బస్సులకు మాత్రమే వర్తిస్తుందని టీజీఎస్ఆర్టీసీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. సాధారణ సర్వీసుల్లో ఛార్జీలు యథాతథంగానే ఉన్నాయని తెలిపాయి. పండగ సమయంలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చిన తర్వాత బస్సులు ఖాళీగా తిరిగి రావడం వల్ల అయ్యే నిర్వహణ ఖర్చులను భర్తీ చేసేందుకు ఈ 50 శాతం సర్ఛార్జి విధిస్తున్నట్లు అధికారులు వివరిస్తున్నారు. 2003లో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వు (జీవో ఎంఎస్ నెం. 16) ప్రకారమే ఈ సర్ఛార్జిని వసూలు చేస్తున్నామని, ఇది కొత్త విధానం కాదని టీజీఎస్ఆర్టీసీ చెబుతోంది. అయినప్పటికీ, పండగ వేళ ఛార్జీల పెంపు సరైంది కాదని ప్రతిపక్షాలు విమర్శిస్తుండటంతో ఈ అంశంపై రాజకీయంగా చర్చ మొదలైంది.

సౌదీ అరేబియాలోని భారతీయులకు అలర్ట్

భద్రతా నిబంధనలు పాటించాలంటూ ఆదేశం

సౌదీ అరేబియాలో భద్రతాపరమైన ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో భారత రాయబార కార్యాలయం కీలక సూచనలు జారీ చేసింది. సౌదీ ప్రభుత్వం జారీచేసే మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని భారతీయులకు సూచించింది. ప్రమాదం తొలగిపోయేవరకు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని కిటికీలు, అద్దాలు, బాల్కనీలకు దూరంగా సురక్షితమైన గదుల్లోనే ఉండాలని పేర్కొంది. మక్కా, మదీనా, రియాద్, తూర్పు ప్రావిన్సుల్లో అత్యవసర సహాయం కోసం '911' నంబర్‌కు, మిగతా ప్రాంతాల వారు '998' నంబర్‌కు కాల్ చేయాలని భారత ఎంబసీ సూచించింది. ముఖ్యంగా దాడికి సంబంధించిన ఫోటోలు, వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయవద్దని భారత ఎంబసీ హెచ్చరించింది. సౌదీ అధికారులు అత్యవసర హెచ్చరికల కోసం జాతీయ ముందస్తు హెచ్చరిక వేదిక ద్వారా జారీ చేస్తున్న తాజా మార్గదర్శకాలను గమనించాలని, వాటిని తప్పనిసరిగా పాటించాలని ఆదివారం సూచించింది. అత్యవసర హెచ్చరికలు అందినప్పుడు ఆందోళన చెందకుండా ప్రశాంతంగా ఉండాలని సౌదీ అధికారులు సూచించారు. ప్రమాదం తొలగిపోయే వరకు భవనంలోని సురక్షిత ప్రాంతానికి వెంటనే వెళ్లాలని, వీలైతే కిటికీలకు దూరంగా ఉన్న లోపలి గదిలో ఉండాలని తెలిపారు. ప్రమాదం ముగిసే వరకు ఇళ్లను లేదా భవనాలను విడిచి బయటకు రావద్దని, బహిరంగ ప్రదేశాలు, కిటికీలు, అద్దాలకు దూరంగా ఉండాలని సూచించారు. బాల్కనీలు, భవనాల పైకప్పులపై నిలబడకూడదని స్పష్టం చేశారు.

జగన్‌కు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత ఉందా..?

మొదటి పేజి తరువాయి

అమరావతి, అక్టోబరు 18 : వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు ప్రజాస్వామ్యం గురించి ప్రశ్నిస్తున్నా ఆయన.. 2020 స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్షాలపై జరిగిన దాడులకు ఏమని సమాధానం చెబుతారని నిలదీశారు. ఈరోజు (ఆదివారం) అమరావతి వేదికగా మీడియాతో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడారు. మాచర్లలో బోండా ఉమామహేశ్వరరావు, బుద్ధా వెంకన్నల వాహనంపై దాడి జరిగినప్పుడు జగన్‌కు ప్రజాస్వామ్యం, రాజ్యాంగం గుర్తుకురాలేదా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. పుంగనూరులో జనసేన అభ్యర్థి నామినేషన్ పత్రాలు చింపివేశారనే ఆరోపణలపై జగన్ ప్రభుత్వం గతంలో ఏం చర్యలు తీసుకుంది..? అని ప్రశ్నల వర్షం కురిపించారు.



ఆ ఆర్డినెన్స్ ఎందుకు తీసుకొచ్చారు..?

నాడు టీడీపీ, జనసేన అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారనే ఫిర్యాదులకు సమాధానం ఇవ్వకుండా ఇప్పుడు జగన్ నీతులు చెప్పడమేంటి..? అని మంత్రి అచ్చెన్నాయుడు నిలదీశారు. ఎన్నికల సంఘం స్వతంత్రత గురించి మాట్లాడే జగన్.. నిమ్మగడ్డ రమేశ్ కుమార్ పదవీకాలాన్ని తగ్గిస్తూ ఆర్డినెన్స్ ఎందుకు తీసుకొచ్చారు..? అని నిలదీశారు. నిమ్మగడ్డ రమేశ్‌పై తీసుకున్న చర్యలను ఏపీ హైకోర్టు కొట్టివేసిన విషయం జగన్‌కు గుర్తులేదా..? అని ప్రశ్నించారు. వైసీపీ హయాంలో స్థానిక ఎన్నికల్లో పెద్దసంఖ్యలో ఏకగ్రీవాలు జరిగినప్పుడు వచ్చిన బెదిరింపులు, బలవంతపు ఉపసంహరణల ఆరోపణలకు సమాధానం ఏం చెబుతారు..? అని నిలదీశారు.

ఎవరూ తప్పు చేసినా చట్టప్రకారం చర్యలు..

ఆనాడు జగన్ హయాంలో వైసీపీ దాడులు, బెదిరింపుల మధ్య టీడీపీ కార్యకర్తల ప్రాణాలను కాపాడుకోవడమే ప్రశ్నార్థకంగా మారిందని, చివరకు స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరించాల్సిన పరిస్థితి ఏర్పడిందని మరిచిపోయావా జగన్..? అని మంత్రి ధ్వజమెత్తారు. పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డి ఘటనపై జగన్ చేసిన ఆరోపణలతో సహా ఎన్నికల హింసపై నిష్పాక్షికమైన దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. ఎవరూ తప్పు చేసినా చట్టప్రకారం చర్యలు తప్పవని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

ఇరాన్ నూతన రక్షణ మంత్రిగా మెహ్రాదాద్ అఖ్లూఘీ.. పార్లమెంట్ ఆమోదం

మొదటి పేజి తరువాయి

భారీ మెజార్టీతో గెలుపు

మొత్తం పోలైన 277 ఓట్లలో మెహ్రాదాద్ అఖ్లూఘీకి అనుకూలంగా 237 ఓట్లు వచ్చాయి. దీంతో ఆయన ఇరాన్ నూతన రక్షణ మంత్రిగా పగ్గాలు చేపట్టారు. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన మొదటి విడత దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ, ఇతర సీనియర్ మిలిటరీ కమాండర్లతో పాటు అప్పటి రక్షణ మంత్రి అజీజ్ నసీర్‌జాదే మరణించారు. ఆ ఘటన తర్వాత సుదీర్ఘ కాలం ఖాళీగా ఉన్న ఈ అత్యంత కీలకమైన పదవికి ఇప్పుడు అఖ్లూఘీ ఎంపికయ్యారు. అఖ్లూఘీకి ఎలాంటి ప్రత్యక్ష సైనిక హోదా లేకపోయినప్పటికీ, ఆయన ఇరాన్ రక్షణ మంత్రిత్వ శాఖలో 42 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నారు. 2013 నుంచి ఇరాన్ ఆయుధాల తయారీ సంస్థ అయిన 'ఇరానియన్ డిఫెన్స్ ఇండస్ట్రీస్ ఆర్గనైజేషన్' అధిపతిగా వ్యవహరిస్తున్నారు.

ఐక్యరాజ్యసమితి ఆంక్షలు

న్యూక్లియర్, బాలిస్టిక్ మిస్సైల్ తయారీ కార్యకలాపాల్లో భాగస్వామ్యం ఉందనే ఆరోపణలతో 2007లోనే ఐక్యరాజ్యసమితి (ఖచీ) అఖ్లూఘీపై ఆంక్షలు విధించింది. కాగా, ఓటింగ్ ముందు అఖ్లూఘీ మాట్లాడుతూ.. 'ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న పరిస్థితుల నేపథ్యంలో రక్షణ శాఖ బాధ్యతలు స్వీకరించడం అత్యంత సున్నితమైన అంశం. దేశ రక్షణకు ప్రస్తుత పరిణామాల వెనుక ఉన్న లాజిక్‌ను అర్థం చేసుకోవడం, భవిష్యత్తు సవాళ్లకు అనుగుణంగా సిద్ధంగా ఉండటం ఎంతో అవసరం' అని స్పష్టం చేశారు. కాల్పుల విరమణ ప్రయత్నాలు, యుద్ధ పరిణామాలు ఊపందుకుంటున్న వేళ ఇరాన్



క్షిపణి, సైనిక సాంకేతిక పరిజ్ఞానంలో అనుభవజ్ఞుడైన అఖ్లూఘీని రక్షణ మంత్రిగా ఎన్నుకోవడం అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

ఒక్క ఉద్యోగం లేదు, కోట్లాది రూపాయలు వసూలు: టోమ్‌కామ్‌పై హరీశ్ రావు ఫైర్

మొదటి పేజి తరువాయి

ఓ పెద్ద రాకెట్‌గా మారిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. జర్మనీలో ఉద్యోగాల పేరు చెప్పి 70 మందికి పైగా యువకుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి, వారిని నట్టేట ముంచారని సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హరీశ్ రావు ఆరోపణల ప్రకారం, సుమారు 15 జిల్లాల నుంచి 70-75 మంది నిరుద్యోగ యువకుల నుంచి టోమ్‌కామ్ ఒక్కొక్కరి దగ్గర రూ.4.10 లక్షల చొప్పున వసూలు చేసింది. పరీక్షలు, ఇన్సూరెన్స్, వీసా ఖర్చులతో కలిపి ఇది ఒక్కో అభ్యర్థికి దాదాపు రూ.4.5 లక్షలకు చేరిందని ఆయన వివరించారు. పేద రైతు కుటుంబాలకు చెందిన వారు తమ ఇంట్లోని మహిళల బంగారాన్ని తాకట్టు పెట్టి, అప్పులు చేసి ఈ డబ్బు కట్టారని, రెండేళ్లు గడిచినా ఉద్యోగాలు రాకపోవడంతో ఇంకా వడ్డీలు చెల్లిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్లు దాటినా, బాధితుల్లో ఒక్కరిని కూడా ఒక్క జర్మన్ కంపెనీ కూడా ఇంటర్వ్యూ చేయలేదని హరీశ్ రావు తెలిపారు. జర్మన్ భాషలో బీ1 పరీక్ష పాసైన వారిని, ఇప్పుడు బీ2 పాస్ కావాలని చెప్పి కాలయాపన చేస్తున్నారని



మండిపడ్డారు. వీరిలో తొమ్మిది మంది జర్మనీకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారంటూ టోమ్‌కామ్ ప్రచారం చేసుకున్నా, ఒక్కరు కూడా వెళ్లలేదని స్పష్టం చేశారు. ఈ అభ్యర్థులతో కుదుర్చుకున్న ఒప్పందంలో ఏదైనా వివాదం తలెత్తితే 1,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్నో కోర్టులో తేల్చుకోవాలని నిబంధన పెట్టడం దారుణమని అన్నారు. టోమ్‌కామ్ ద్వారా ఇప్పటివరకు ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయో చెప్పాలని ఆర్టీఐ ద్వారా అడిగినా, గడువు ముగిసినా సమాధానం ఇవ్వడం లేదని విమర్శించారు. బాధితులు రెండేళ్లుగా ఎదురుచూస్తుంటే, ఈ ఏడాది జూన్‌లో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి కొత్త టోమ్‌కామ్ బ్యాచ్‌ను ప్రారంభించి ఉద్యోగ హామీలు ఇవ్వడం బాధితులను అవమానించడమేనని హరీశ్ రావు దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. ఈ మోసానికి పాల్పడిన టోమ్‌కామ్, ఫెయిర్‌స్టీట్ ఇండియా సంస్థల నుంచి వసూలు చేసిన ప్రతి రూపాయిని బాధితులకు తిరిగి చెల్లించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. వారు కోల్పోయిన రెండేళ్ల కాలానికి, వడ్డీ భారం, మానసిక వేదనకు నష్టపరిహారం అందించాలన్నారు. బాధితులందరికీ ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని, ఈ వ్యవహారంపై తక్షణమే సీబీడీ లేదా జ్యుడీషియల్ విచారణ జరిపి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. ఫీజుల వసూళ్లు, కల్పించిన ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హరీశ్ రావు తన పోస్టులో స్పష్టం చేశారు.

మా తీర్పు కాగితాలకే పరిమితం కావాలా?'- రుతుక్రమ ఆరోగ్యంపై రాష్ట్రాల నిర్లక్ష్యం

మొదటి పేజి తరువాయి

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు స్పందించకపోవడంపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వం కోరినప్పటికీ ఇప్పటివరకు అవసరమైన వివరాలు అందించకపోవడంపై ప్రశ్నించింది. తదుపరి విచారణ నాటికి కూడా స్పందించకపోతే, ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించింది. జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం అక్టోబర్ 13న ఈ అంశంపై విచారించింది. బహిష్టు ఆరోగ్యానికి సంబంధించిన ప్రాథమిక హక్కు తీర్పు కేవలం కాగితాలకే పరిమితం కాకూడదని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 జీవించే హక్కు వ్యక్తిగత స్వేచ్ఛకు రక్షణ కల్పిస్తుందని ధర్మాసనం గుర్తుచేసింది. రుతుక్రమ పరిశుభ్రత, ఆరోగ్యం కూడా ఈ హక్కులో భాగమని సుప్రీం కోర్టు ఇప్పటికే ప్రకటించిందని తెలిపింది. సెప్టెంబర్ 1న ఇచ్చిన ఆదేశాల్లో తీర్పులో ప్రస్తావించిన లోపాల్ని పరిశీలించి, వాటిపై తీసుకున్న చర్యల వివరాల్ని తదుపరి విచారణకు సమర్పించాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించినట్లు బెంచ్ గుర్తుచేసింది. అయినా కేంద్రం కోరిన సమాచారం ఇవ్వకపోవడంపై కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టు తీర్పులో చెప్పిన అంశాలు కేవలం కాగితాలపైనే ఉంటే, ఈ ప్రాథమిక హక్కును కేంద్రం, రాష్ట్రాలు ఎలా అమలు చేస్తాయని ప్రశ్నించింది.

తీర్పు ప్రాముఖ్యతను అర్థం చేసుకోండి- డిసెంబర్ 14 డెడ్‌లైన్

కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి- ఈ అంశాన్ని కేంద్రం తీవ్రంగా పరిగణిస్తోందని, తీర్పు అమలు తీరుపై వివరాలు ఇవ్వాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్ని కోరినట్లు తెలిపారు. అయితే ఇప్పటివరకు స్పందన రాలేదని ఆమె కోర్టుకు వివరించారు. దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ధర్మాసనం- కేంద్రం కోరినా రాష్ట్రాలు ఎందుకు స్పందించడం లేదో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ తీర్పు ప్రాముఖ్యతను గుర్తించాయని భావిస్తున్నట్లు తెలిపిన ధర్మాసనం- ఆయా రాష్ట్రాలు తీసుకున్న చర్యలకు లిఖితపూర్వక వివరాలు సేకరించాలని కేంద్రాన్ని ఆదేశించింది. తదుపరి విచారణ సమయంలోనూ కొన్ని రాష్ట్రాలైనా స్పందించలేదని కేంద్రం చెబితే, సంబంధిత రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించింది. చివరిసారిగా అవకాశం ఇస్తూ కేసు విచారణను డిసెంబర్ 14 కు వాయిదా వేసింది. 'మేం తీర్పులో చెప్పిన విషయాలు కేవలం కాగితాలకే పరిమితమైతే, కేంద్రం, రాష్ట్రాలు ఈ ప్రాథమిక హక్కును చిన్నారి బాలికలకు ఎలా అందిస్తాయి? సుదూర ప్రాంతాల్లో రుతుస్రావ పరిశుభ్రత సదుపాయాలు లేక చదువుకు దూరమవుతున్న వేలాది మంది బాలికల సంక్షేమం కోసం ఈ తీర్పు ఇచ్చామని గుర్తించాలి.' అని సుప్రీంకోర్టు తెలిపింది.

పాఠశాలల్లో బాలికల సమస్యలపై దృష్టి

రుతుక్రమ పరిశుభ్రత సమస్యల కారణంగా, సరైన సదుపాయాలు లేనందున ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లోని బాలికలు చదువును మధ్యలోనే మానేస్తున్నారని సుప్రీం కోర్టు పేర్కొంది. అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడటమే తీర్పు ప్రధాన ఉద్దేశాల్లో ఒకటని తెలిపింది. సెప్టెంబర్ 1న ఇచ్చిన



ఆదేశాల్లో పాఠశాలల్లో బాలురు, బాలికలకు వేర్వేరుగా ఉండే మరుగుదొడ్లు ఎన్ని ఉన్నాయనే దానితో పాటు, అవి సరిగా ఉన్నాయా లేదా అనే అంశంపై దృష్టి పెట్టాలని స్పష్టం చేసింది. ఇంకా మరుగుదొడ్లకు నీటి సౌకర్యం సరిగా ఉందా లేదా, బాలికలకు ప్రైవసీ, సులభంగా అక్కడికి చేరుకునే సౌకర్యాలు ఉన్నాయో లేదో పరిశీలించాలని ఆదేశించింది. దేశవ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో బాలబాలికలకు విడివిడిగా నీటి సదుపాయం కలిగిన 30458 మరుగుదొడ్లను ఇప్పటికే నిర్మించామని కేంద్ర ప్రభుత్వం గతంలోనే అత్యున్నత న్యాయస్థానానికి తెలియజేసింది. ఇంకా 4236 మరుగుదొడ్ల నిర్మాణం తుది దశలో ఉందని పేర్కొంది. ఇక అంతకుముందు ఈ ఏడాది జనవరి 30న కీలక తీర్పులో కూడా సుప్రీం కోర్టు పలు ఆదేశాలు జారీ చేసింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు అన్నింట్లోనూ నీటి సౌకర్యంతో కూడిన, వేర్వేరు మరుగుదొడ్లు ఉండాలని స్పష్టం చేసింది. అలానే ప్రతి పాఠశాలలో బాలికలకు శానిటరీ న్యాప్‌కిన్లను ఉచితంగా అందించాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. వీటి అమలు తీరుపైనే రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి వివరాలు కోరింది.

అడెల్లి పోచమ్మ.. గంగ నీళ్ల జాతర విశేషాలు..

తెలంగాణ రాష్ట్రంలో నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలో అడెల్లి అనే గ్రామంలో కొలువైన శ్రీ మహా పోచమ్మ తల్లి ఆలయం ప్రసిద్ధ సిద్ధ క్షేత్రం. ఇక్కడ ప్రతి సంవత్సరం దసరాకు ముందు నిర్వహించే గంగనీళ్ల జాతరకు చాలా విశేషమైన ఆధ్యాత్మిక సాంప్రదాయ ప్రాధాన్యం ఉంది. ఈ జాతరలో అమ్మవారి ఆభరణాలను గోదావరి నది జలాలతో శుద్ధి చేసి తిరిగి ఆలయానికి తీసుకు వస్తారు....

ప్రాచీన ఆలయం..

అడెల్లి మహా పోచమ్మ ఆలయం చాలా ప్రాచీనమైనదిగా స్థానికులు భావిస్తారు. సుమారు రెండు వేల సంవత్సరాల చరిత్ర ఉందని ఆలయ పూజారులు పేర్కొంటారు. అమ్మవారి ఆలయం సహ్యాద్రి పర్వత ప్రాంతాల సమీపంలో ఉండటం వల్ల ప్రకృతి సౌందర్యం, ఆధ్యాత్మిక వాతావరణం ఈ క్షేత్రానికి ప్రత్యేకతను తీసుకొచ్చాయి. తెలంగాణ గ్రామీణ సంప్రదాయంలో పోచమ్మ తల్లిని గ్రామాన్ని, ప్రజలను కాపాడే శక్తిస్వరూపిణిగా ఆరాధిస్తారు. అడెల్లి క్షేత్రంలోనూ భక్తులు అమ్మవారిని తమ ఇలవేల్పుగా భావించి పూజలు నిర్వహిస్తారు.

గంగ నీళ్ల జాతర..


అడెల్లి పోచమ్మ క్షేత్రంలో అత్యంత విశిష్టమైన ఉత్స

అనంత సూర్య తెలుగువార

సోమవారం 19 అక్టోబర్ 2026

ఎంపీటీసీల ఎంపికపై కొనసాగుతున్న కసరత్తు

అనంతపురం, అక్టోబర్ 18 అనంత సూర్య : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాప్తాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ మూడో రోజు కూడా కొనసాగింది. అన్ని స్థానాల్లో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. ఆదివారం కూడా ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్య నాయకులతో సమావేశాలు నిర్వహించారు. ప్రధానంగా ఆత్మకూరు మండలం పరిధిలోని ఎంపీటీసీ అభ్యర్థులతో పాటు, అనంతపురం రూరల్ మండలంలో కొన్ని ఎంపీటీసీ స్థానాల అభ్యర్థుల ఎంపికపై సుదీర్ఘంగా చర్చించారు. ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల్లోని పలు కీలక స్థానాల అభ్యర్థుల ఎంపికపై ఒక స్పష్టమైన అవగాహన వచ్చింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. స్థానికంగా ప్రజల్లో మంచి గుర్తింపు ఉండి, నిరంతరం అందుబాటులో



ఉండే నాయకులనే అభ్యర్థులుగా ఎంపిక చేస్తున్నట్లు చెప్పారు. అభ్యర్థుల ఎంపికలో ఎలాంటి ఏకపక్ష నిర్ణయాలు ఉండవని, స్థానిక నాయకులు, కార్యకర్తల అందరి అభిప్రాయాలను, సమీకరణాలను నిశితంగా పరిశీలించిన తర్వాతే తుది జాబితాను ప్రకటిస్తామని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు.

నామినేషన్ కేంద్రాల వద్ద పకడ్బందీ భద్రతా ఏర్పాట్ల పరిశీలన

– జిల్లా ఎస్పీ జగదీష్ ఐపిఎస్

అనంతపురం క్రైమ్ ప్రతినిధి, అక్టోబర్ 18 అనంత సూర్య : నగరంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సజావుగా సాగేలా చూడాలని జిల్లా ఎస్పీ జగదీష్ అధికారులను ఆదేశించారు. నామినేషన్ల దాఖలు ప్రక్రియను క్షేత్ర-స్థాయిలో పర్యవేక్షించేందుకు ఎస్పీ ఆదివారం నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని నామినేషన్ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ అమలు చేస్తున్న భద్రతా చర్యలను, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.



నిబంధనల ఉల్లంఘన జరగకూడదు : ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ.. ఎన్నికల నియమ నిబంధనలు క్షేత్రస్థాయిలో పక్కాగా అమలయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. నామినేషన్ కేంద్రాల పరిధిలో ఎలాంటి నిబంధనల ఉల్లంఘన జరిగినా ఉపేక్షించేది లేదని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను అప్రమత్తం చేశారు.

శాంతిభద్రతలకు అత్యధిక ప్రాధాన్యం : బందోబస్తు విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు మరియు సిబ్బంది అప్రమత్తంగా ఉండి శాంతిభద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కేంద్రాల వద్దకు వచ్చే నాయకులు, కార్యకర్తలు, ప్రజల రాకపోకలను నియంత్రించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా అవాంఛనీయ కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని, ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు సిబ్బంది అందరూ సమన్వయంతో విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ వెంట నగర సి.ఐలు పుల్లయ్య, కౌలుట్లయ్య, మస్తాన్,తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నేపథ్యంలో యాడికిలో పోలీసుల వాహన తనిఖీలు

యాడికి అనంత సూర్య ప్రతినిధి అక్టోబర్(18) : శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు: సీఐ శ్రీనివాసులు హెచ్చరిక యాడికి మండలంలో సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహించారు. రాబోయే ఎన్నికల నేపథ్యంలో మండలంలో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని సూచించారు. ఎలాంటి గొడవలు, ఘర్షణలకు తావు లేకుండా ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో ఎవరూ



శాంతిభద్రతలకు విఘాతం కలిగించకూడదని, ప్రజలందరూ పరస్పర సహకారంతో ఎన్నికల ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు తోడ్పడాలని కోరారు. ఎవరైనా ఎన్నికల సమయంలో గొడవలు సృష్టించినా, శాంతిభద్రతలకు భంగం కలిగించినా



వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీస్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తారని పేర్కొన్నారు. ప్రజల భద్రత, ప్రశాంత ఎన్నికలే పోలీసుల లక్ష్యం అని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

స్థానిక ఎన్నికలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక బలగాలతో నిఘా


చిత్తూరు,అక్టోబర్ 18 (అనంత సూర్య):జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సాధారణ ఎన్నికల పరిశీలకుడు, సీడీఎంఏ ఎల్. శివశంకర్ అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి అదనపు భద్రత కల్పించాలని సూచించారు.ఆదివారం చిత్తూరు కలెక్టరేట్‌లోని నాగార్జున ఐఏఎస్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ తుషార్ డూడీతో కలిసి వివిధ శాఖల అధికారులతో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. నామినేషన్, పోలింగ్, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో వీడియో చిత్రీకరణతోపాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఎన్నికల సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని పరిశీలకుడు సూచించారు.

168 వార్డులకు అక్టోబర్ 28న పోలింగ్

జిల్లాలోని నగరపాలక సంస్థ, పురపాలక సంఘాల పరిధిలోని 168 వార్డులకు ఈ నెల 28న పోలింగ్, 30న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఎన్నికల సిబ్బందికి తొలి విడత శిక్షణ పూర్తయిందని, ఈ నెల 23 నుంచి 25వ తేదీలోగా రెండో విడత శిక్షణ నిర్వహిస్తామని చెప్పారు. ప్రజల ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు ఏర్పాట్లు

జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను స్వేచ్ఛగా, పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో నాలుగు రెవెన్యూ డివిజన్లు, 27 మండలాలు, 622 గ్రామ పంచాయతీలు ఉన్నాయని, 370 ఎంపీటీసీ, 27 జెడ్పీటీసీ స్థానాలు ఉన్నాయని పేర్కొన్నారు.జిల్లా గ్రామీణ ప్రాంత జనాభా 12,90,810 కాగా, మొత్తం ఓటర్లు 10,26,821 మంది ఉన్నట్లు తెలిపారు. వీరిలో పురుషులు 5,07,703



మంది, మహిళలు 5,19,091 మంది, ఇతరులు 27 మంది ఉన్నారు.ఎన్నికల కోసం జిల్లావ్యాప్తంగా 1,236 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిలో 524 సాధారణ, 366 సున్నితమైన, 346 అత్యంత సున్నితమైన కేంద్రాలుగా గుర్తించారు. ఎన్నికల నిర్వహణకు 2,616 పెద్ద, 2,113 చిన్న బ్యాలెట్ పెట్టెలను సిద్ధం చేయగా, 2,472 పెద్ద బ్యాలెట్ పెట్టెలను ఇప్పటికే మండలాలకు పంపిణీ చేసినట్లు వివరించారు.27 మండలాలకు రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమించామని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును పర్యవేక్షించేందుకు ప్రతి మండలంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పోలింగ్ విధుల కోసం 4,126 మంది ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులను నియమించినట్లు చెప్పారు.

సుమారు 2,000 మంది పోలీసులతో భద్రత

జిల్లా ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ స్థానిక ఎన్నికల సందర్భంగా సుమారు 2,000 మంది పోలీసులతో భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక స్ట్రైకింగ్ ఫోర్స్‌లతో అదనపు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్నవారిని గుర్తించి బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు వివరించారు.పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలుకు చర్యలు తీసుకుంటున్నామని, పొరుగు రాష్ట్రాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేస్తామని తెలిపారు. నగదు, మద్యం రవాణాపై, ఇతర ప్రాంతాల నుంచి ప్రచారం కోసం వచ్చే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు చెప్పారు. సీసీ కెమెరాలు, డ్రోన్లు, తాత్కాలిక చెక్‌పోస్టుల ద్వారా పర్యవేక్షణ చేపడుతున్నట్లు వెల్లడించారు.చిత్తూరులోని పీవీకేఎన్ డిగ్రీ కళాశాల, సీటమ్స్ ఇంజినీరింగ్ కళాశాల, కుప్పంలోని ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాల, నగరిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పలమనేరులోని ఎస్వీసీఆర్ కళాశాల, టీకేసీ జూనియర్ కళాశాలల్లో స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాల ఏర్పాట్లు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డీపీవో సుధాకర్ బాబు, డీఎల్‌డీఏ రవి, డీఆర్‌డీఏ ఏపీడీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రులలో భాగంగా శ్రీపెద్దమ్మ తల్లికి

8వ రోజు దుర్గాష్టమి మహిషాసుర మర్దని దేవి అలంకారం



యాడికి అనంత సూర్య ప్రతినిధి అక్టోబర్(18): యాడికి శ్రీపెద్దమ్మ తల్లి కి శరన్నవరాత్రులలో భాగంగా ఎనిమిదవ రోజు దుర్గాష్టమి మహిషాసుర మర్దని దేవి అలంకారం ఏర్పాటు చేశారు ప్రతిరోజు లాగానే ఉదయం నుండి షోడశోపచారాలన్నీ నిర్వహించి చండీ హోమం నిర్వహించారు (మహిషాసురుడు అనే మట్టి దున్నపోతును) తయారుచేసి మైలారి అనే వేషధారణతో మహిషాసుర మర్దని కార్యక్రమం నిర్వహించి వేదపండితులు మహిషాసుర మర్దని కార్యక్రమం గురించి నవరాత్రులలో ఎంతో ముఖ్యమైన ఘట్టంగా పురాణాలు కథలు తెలియజేశారు మహిషాసుర మర్దని నాటక ఘట్టం ఎంతో వ్యక్తి కట్టించింది భక్తాదులందరూ భక్తిశ్రద్ధలతో తిలకించి జై పెద్దమ్మతల్లి జై జై పెద్దమ్మతల్లి అంటూ ఆలయ ప్రాంగణమంతా మారుమోగింది ఈ కార్యక్రమానికి అన్నా ముందు హోమాలు జపాలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమం అంతా యాడికి పెద్దమ్మ తల్లి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు పెద్ద ఎత్తున వచ్చిన భక్తాదులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు

19న జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉండదు



అనంతపురం క్రైమ్ ప్రతినిధి, అక్టోబర్ 18 అనంత సూర్య : స్థానిక సంస్థల ఎన్నికలు మరియు మహర్నవమి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు ఉన్నందున ఈనెల 19వ తేదీ సోమవారం అనంతపురం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరగదని జిల్లా ఎస్పీ జగదీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి సహకరించాలన్నారు,అర్జీలు ఇచ్చేందుకు జిల్లా పోలీసు కార్యాలయానికి ఎవరూ రాకూడదని తెలిపారు. క్షేత్రస్థాయిలో కూడా జిపిఆర్ఎస్ నిర్వహించడం జరగదని తెలిపారు.

నామినేషన్ల స్వీకరణ క్షేత్రస్థాయిలో తనిఖీ



చిత్తూరు,అక్టోబర్ 18 (అనంత సూర్య):స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చిత్తూరు నగరపాలక సంస్థలో ఎన్నికల ఏర్పాట్లను జిల్లా ఎన్నికల పరిశీలకుడు, సీఎండీ శివశంకర్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఆదివారం పరిశీలించారు.నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ, నామినేషన్ కౌంటర్ల నిర్వహణ, సీసీటీవీ కెమెరాల పనితీరు, ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది వివరాలను వారు తనిఖీ చేశారు. ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్, సహాయ ఎన్నికల అధికారి, తహసీల్దార్ కల్యాణి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ఫారం-ఏ పత్రాలు కలెక్టర్‌కు అందజేత

చిత్తూరు, అక్టోబర్ 18 (అనంత సూర్య): చిత్తూరు జిల్లాలో నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు బి-ఫారాలు జారీ చేసేందుకు అధికారం కల్పించే ఫారం-ఏ పత్రాలను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆదివారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు అందజేశారు.రాజకీయ పార్టీల తరఫున బి-ఫారాలు జారీ చేసే అధికారిక ప్రతినిధుల వివరాలతో కూడిన లేఖలను కలెక్టరేట్‌లో సమర్పించారు. ఆయా లేఖల్లో సిఫారసు చేసిన అధికారిక ప్రతినిధులు జారీ చేసే బి-ఫారాల్లో పేర్కొన్న అభ్యర్థుల పేర్లను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు..

పీజీఆర్ఎస్ కార్యక్రమం రద్దు

చిత్తూరు,అక్టోబర్ 18 (అనంత సూర్య): జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ఈ నెల 19వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), డైలీ గ్రీవెన్స్ కార్యక్రమాలను రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళి అక్టోబర్ 14 నుంచి డిసెంబర్ 3 వరకు అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. ఈ కాలం ముగిసే వరకు ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.ప్రజలు ఈ విషయాన్ని గమనించి, అర్జీలు సమర్పించేందుకు సోమవారం కలెక్టరేట్‌కు రావద్దని కలెక్టర్ సూచించారు.

వైసీపీ మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్ నామినేషన్ దాఖలు

- వైసీపీ మేయర్ అభ్యర్థిత్వాన్ని బలపరిచిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, మాజీ మేయర్ వసీం
- ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఆయన అనుచరులతో భయభ్రాంతులకు గురైన అనంత ప్రజలు
- కూటమి పాలనపై విసుగుచెందిన ప్రజలు.. వైసీపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారు
- 62కు 62 డివిజన్లు గెలుస్తామని ధీమా..
- మీడియాతో వైసీపీ మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్









అనంతపురం, అక్టోబర్ 18 అనంత సూర్య :

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున అనంతపురం నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా చిట్లూరు రమేష్ గౌడ్ నామినేషన్ దాఖలు చేశారు. తొలుత మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి స్వగృహం నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, యువతతో కలిసి రమేష్ గౌడ్ ర్యాలీగా బయలుదేరారు. నామినేషన్ కేంద్రానికి చేరుకున్న రమేష్ గౌడ్.. తన అభ్యర్థిత్వాన్ని బలపరిచే వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, మాజీ మేయర్ మహ్మద్ వసీంతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన రమేష్ గౌడ్.. కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రెండేళ్ల పాలనలో కూటమి ప్రభుత్వం అనంతపురం నగరాన్ని భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. నగర అభివృద్ధిని విస్మరించి ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. నగర ఎమ్మెల్యే, ఆయన అనుచరులు భూ దందాలకు పాల్పడుతున్నారని, ప్రజలను బెదిరింపులకు గురి చేస్తున్నారని రమేష్ గౌడ్ ఆరోపించారు. నగరంలోని విలువైన భూముల వ్యవహారాల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఆయన అనుచరులు అక్రమాలకు పాల్పడుతూ నగరాన్ని దోచుకుంటున్నారని విమర్శించారు. ప్రజల ప్రయోజనాల కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. మన అనంతపురం నగరాన్ని మనమందరం కలిసికట్టుగా కాపాడుకుందామన్నారు. నగరంలో నెలకొన్న సమస్యలు, పాలనాపరమైన అంశాలపై కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మేయర్ అభ్యర్థిగా వైసీపీ తరపున నామినేషన్ దాఖలు చేశానని.. తనకు ఒకసారి అవకాశం ఇస్తే నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతానని తెలిపారు.



మీ ఇంటి బిడ్డగా ఆశ్వీరదించండి :

వైసీపీ మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్

అనంతపురం నియోజకవర్గ ప్రజలందరూ తమ ఇంటి బిడ్డగా తనను ఆశ్వీరదించాలని వైసీపీ మేయర్ అభ్యర్థి చిట్లూరు రమేష్ గౌడ్ కోరారు. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నగరాన్ని సుందర అనంతగా తీర్చిదిద్దుతానని, తాగునీటి సమస్య లేకుండా చేస్తానని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తానని హామీనిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకెళ్తానన్నారు. కావున నగర ప్రజలు మేయర్‌గా తనకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని, నగరంలో డ్రైనేజ్ సమస్య లేకుండా చూస్తానని, ప్రజా సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైసీపీ శ్రేణులు అనంత చంద్రారెడ్డి, మాజీ జెడ్పీ వైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నగర అధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, యువజన విభాగం అధ్యక్షులు సాకే చంద్ర, మాజీ డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, ఉమ్మడి మదన్ మోహన్ రెడ్డి, రిజ్వాన్, కమల భూషణ్, రిలాక్స్ నాగరాజు, నాగార్జున, పెన్నోబులేసు, మహిళ నాయకురాలు.. బిందెల శ్రీదేవి రెడ్డి, శోభ, భారతి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మేయర్ అభ్యర్థిగా అజేష్ యాదవ్ నామినేషన్

- తరలివచ్చిన రాష్ట్ర అగ్రనేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ, ముఖ్య నాయకులు కూటమి శ్రేణుల భారీ జనసందోహంతో అనంత వీధుల్లో సందడి
- వైసీపీ పుకార్లకు భారీ ర్యాలీతో సమాధానం చెప్పిన కూటమి
- అజేష్ గెలుపుకు 3పార్టీలు కలసి పని చేస్తాయి.. రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్
- వైసీపీకి ఓటు వేస్తే మునిగిపోయినట్టే.. మంత్రి సత్యకుమార్
- 2024కు మించిన స్ట్రైక్ రేట్‌తో గెలుపు ఉంటుంది.. ఎమ్మెల్యే దగ్గుపాటి
- డబుల్ ఇంజన్ సర్కార్‌ను ఆశీర్వదించండి.. ఎంపీ అంబికా
- అపోహలు లేవు.. మేమేంటో మా గెలుపు ద్వారా చూపిస్తాం.. అజేష్ యాదవ్

అనంతపురం, అక్టోబర్ 18 అనంత సూర్య :

అనంతపురంలో కూటమి పార్టీల బీజేపీ మేయర్ అభ్యర్థి అజేష్ యాదవ్ నామినేషన్ కార్యక్రమం భారీ జనసందోహం, కోలాహల వాతావరణంలో సాగింది. ఈ నామినేషన్ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు వనితా శ్రీనివాస్ అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు, మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్ రెడ్డి, అర్బన్ పరిశీలకులు దేవేంద్రప్ప, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్, అహూడా చైర్మన్, జనసేన జిల్లా అధ్యక్షుడు టి.సి.వరుణ్ సహా కూటమి పార్టీల ముఖ్య నాయకులు పెద్ద ఎత్తున హాజరై అజేష్ యాదవ్‌కు సంఘీభావం ప్రకటించారు. నామినేషన్ దాఖలుకు ముందు కోర్టు రోడ్డు నుండి ప్రారంభమైన భారీ ప్రదర్శన టవర్ క్లాక్, సప్తగిరి సర్కిల్ మీదుగా నగరపాలక సంస్థ కార్యాలయం వరకు సాగింది. ఈ ర్యాలీలో తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీలకు చెందిన వందలాది మంది కార్యకర్తలు తరలిరావడంతో సందడి కనిపించాయి. అనంతపురం వీధులన్నీ మూడు జెండాలతో రెపరెపలాడాయి. కూటమి శ్రేణుల నినాదాలు, డప్పు వాయిద్యాల నడుమ పండగ వాతావరణం కనిపించింది. నామినేషన్ అనంతరం 3 పార్టీల నాయకులు మాట్లాడుతూ.. తామంతా ఐక్యంగా అజేష్ గెలుపు కోసం పని చేస్తామని చెప్పారు.



100 శాతం స్ట్రైక్ రేట్‌తో కూటమి విజయం ఖాయం.. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వ పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని.. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. కూటమి అందిస్తున్న సుపరిపాలన పట్ల ప్రజలంతా అత్యంత హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. గత పాలకుల అరాచకాలతో విసిగిపోయిన ప్రజలు మొన్నటి ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేట్‌తో కూటమికి అఖండ విజయాన్ని అందించారన్నారు. ఇప్పుడు జరుగుతున్న నగరపాలక సంస్థ ఎన్నికలో నూటికి నూరు శాతం స్ట్రైక్ రేట్‌తో కూటమి అభ్యర్థిని గెలిపించేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారున్నారు. అజేష్ యాదవ్ ప్రజల ఆశీస్సులతో భారీ మెజార్టీతో విజయం సాధించబోతున్నారన్నారు.

వైసీపీ గూండాల పుకార్లకు చెక్ పడింది.. అజేష్ యాదవ్


నగర మేయర్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు నాకు ఈ గొప్ప అవకాశం కల్పించిన కూటమి అధినాయకత్వానికి అజేష్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతపురంలో కూటమి పార్టీల మధ్య విభేదాలు ఉన్నాయంటూ వైసీపీ గూండాలు పెద్ద ఎత్తున అపోహలు, పుకార్లు సృష్టించారన్నారు. కానీ ఈ రోజు మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఒకే తాటిపై తరలివచ్చి సృష్టించిన ఈ జనసందోహం ఆ పుకార్లకు శాశ్వతంగా చెక్ పెట్టిందన్నారు. నామినేషన్ ర్యాలీతోనే కూటమి విజయం ఖరారైందని.. కూటమిలోని ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేసి అనంతపురం మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అందరి సహకారంతో నగర రూపురేఖలను మార్చి చూపిస్తానని అజేష్ యాదవ్ తెలిపారు.



జగన్ రెడ్డి మార్క్ అరాచకాలు సాగవు.. తాట తీస్తాం

- ఎమ్మెల్యే దగ్గుపాటి

మా మూడు పార్టీల ఉమ్మడి అభ్యర్థి అజేష్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోబోతున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన స్ట్రైక్ రేట్ కంటే ఈ ఉపఎన్నికలో అంతకంటే ఎక్కువ స్ట్రైక్ రేట్ రావడం ఖాయమన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రజలే స్వచ్ఛందంగా పట్టం కడతారన్నారు. 2021లో గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్ రెడ్డి తీవ్ర విధ్వంసం సృష్టించారన్నారు. ఇప్పుడు కూడా దాడులు చేసి, భయభ్రాంతులు సృష్టించి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ ఇక్కడ అధికారంలో ఉన్నది ఎన్డీఏ ప్రభుత్వమని గుర్తుంచుకోవాలని.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇలాంటి అరాచకాలు చేస్తే తాట తీస్తారని హెచ్చరించారు.



మేయర్ అభ్యర్థిగా చెన్నంపల్లి కిశోర్‌బాబు నామినేషన్ దాఖలు

అనంతపురం, అక్టోబర్ 18 అనంత సూర్య :

అనంతపురం నగర కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా నవతరం పార్టీ తరపున చెన్నంపల్లి కిషోర్ బాబు ఆదివారం తన నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. ఈ సందర్భంగా నగరంలోని ముఖ్య కూడళ్ల గుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి భారీ ర్యాలీగా తరలివచ్చి నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ అనంతరం చెన్నంపల్లి కిషోర్ బాబు మీడియాతో మాట్లాడుతూ.. అనంతపురం నగర సమగ్ర అభివృద్ధి, ప్రజల ప్రాథమిక సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నవతరం పార్టీ ఈ ఎన్నికల్లో బరిలోకి దిగుతోందని స్పష్టం చేశారు. నగరంలో తాగునీటి సమస్య, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, రోడ్ల విస్తరణ వంటి కీలక అంశాలపై ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తామని హామీ ఇచ్చారు. సాధారణ, మధ్యతరగతి ప్రజల గొంతుకగా నిలిచేందుకు, నగరపాలనలో పారదర్శకతను తీసుకువచ్చేందుకు అనంతపురం నగర ఓటర్లు నవతరం పార్టీని ఆశీర్వదించాలని, తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నవతరం పార్టీ రాయలసీమ ఇన్‌చార్జ్ మురళీకృష్ణ రాయల్, అనంతపురం జిల్లా అధ్యక్షులు మునగాల సునీల్ కుమార్, నగర ముఖ్య నాయకులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని కిషోర్ బాబుకు పూర్తి మద్దతు తెలిపారు.

మాజీ మేయర్ రాగే పరశురాం, సీనియర్ నేత ఎర్రిస్వామిరెడ్డిలను కలిసిన

వైసీపీ మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్





అనంతపురం, అక్టోబర్ 18 అనంత సూర్య :

అనంతపురం నగరపాలక సంస్థ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి చిట్లూరు రమేష్ గౌడ్ ఆదివారం మాజీ మేయర్ రాగే పరశురాం, సీనియర్ నాయకులు ఎర్రిస్వామిరెడ్డిల ను మర్యాద పూర్వకంగా వారి వారి స్వగృహాల్లో కలిశారు. ప్రస్తుత స్థానిక ఎన్నికల గురించి వారి సుదీర్ఘంగా చర్చించారు.



మేయర్ పదవికి 29 నామినేషన్లు..

62 డివిజన్లకు 440 నామినేషన్ల స్వీకరణ







అనంతపురం, అక్టోబర్ 18 అనంత సూర్య :

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలు-2026కు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ 16 నుండి 18 వరకు నిర్వహించబడి ఆదివారంతో ముగిసింది. ఎన్నికలలో భాగంగా అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలో మేయర్ పదవికి మొత్తం 29 నామినేషన్లు స్వీకరించారు. అదేవిధంగా, నగరపాలక సంస్థ పరిధిలోని 62 డివిజన్లకు సంబంధించి మొత్తం 440 నామినేషన్లు స్వీకరించినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. మేయర్ పదవికి పార్టీల వారీగా నామినేషన్ల వివరాలు బీఎస్పీకి 1, బీజేపీ 4, కాంగ్రెస్ పార్టీ 3, తెలుగుదేశం పార్టీ 1, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 3, ఇతర పార్టీలు 4 (నవతరం పార్టీ - 3, ఆమ్ ఆద్మీ పార్టీ - 1), స్వతంత్రులు - 13 మంది దాఖలు చేశారు. అలాగే 62 డివిజన్లకు పార్టీల వారీగా నామినేషన్ల వివరాలిలా ఉన్నాయి. బీఎస్పీకి 2, బీజేపీ 15, సీపీఐ 3, సీపీఎం 3, కాంగ్రెస్ 3, టీడీపీ 197, వైసీపీ 161, జనసేన 24, స్వతంత్రులు 32 మంది నామినేషన్లు వేశారు. 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలు-2026లో భాగంగా మేయర్ పదవికి, అలాగే 62 డివిజన్లకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగిసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంత రావు వెల్లడించారు.







Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405